శ్రీ కలువకొలను సదానంద

అందరూ నిద్రపోతున్నారు!

భోజనాలు చేసి అందరూ డాబా మీదికి వెళ్లేసరికి పన్నెండు గంటల రాత్రి అయింది. తండ్రీ కొడుకులిద్దరూ పిట్టగోడ దగ్గరకు జరిగి కూర్చున్నారు.

'లోకం నానాటికీ చెడిపోతూవుందిరా అబ్బాయ్!' అంటూ నిట్టూర్చాడు రాజశేఖరం. చంద్రశేఖరం మాట్లాడలేదు.

ఆ రోజు బడిలో వార్షికోత్సవం జరిగింది. తెర తొలగగానే రికార్డుపాట మొదలైంది. తెరచాటు నుంచీ ఓ కన్యకామణి రివ్వున రంగం మీదికి పరుగెత్తుకొచ్చింది. చింతచిగురులాంటి చిన్నది. సీతాకోకచిలుక రెక్కల్లాంటి చేలం కట్టుకొన్నది మెరపు తీగలోని వంపుసొంపులన్నీ తనలో నింపుకొన్నది. అప్సరసలతో సైతం అందంలో పందెం వేయగలది. కోడెవయసు కుర్రకారుకు గంగవెర్రులెత్తించగలది. బేబీ!...దాచుకున్న అందాలను, డెందం లోని వాంఛలను 'వహ్వా!' అనిపించేటట్లుగా ప్రదర్శించింది.

'ఒకడు కావాలి
అతడు రావాలి
నాకు నచ్చినవాడు
నన్ను మెచ్చిన వాడు
ఒకడు కావాలి...'

...ప్రేక్షకు లందరూ రెండు మూడు నిమిషాల పాటు తనువు మరిచిపోయారు. పరిసరాలు మరిచిపోయారు. డ్రామా చూస్తున్నట్లుగాక, సినిమా చూస్తున్నట్లే వుంది వాళ్ళకు. రంగు రంగుల స్పాట్ లైట్ల కాంతిలో బేబీ సాక్షాత్తూ వరూధినిలాగా వెలిగిపోతూ, వంపులూ, సొంపులూ, వయ్యారాలూ వెదజల్లుతూ వుంది. ఆమె ఆడుతూ, పాటకు తగ్గట్లు పెదవులు కదుపుతూ వుంటే, స్వయంగా తనే పాడుతూ, తనకు నచ్చినవాడికోసం వెదుకుతూ వున్నట్లుంది.

నృత్యం పూర్తికాగానే స్టేజి నుండి ~~లు గేటువరకు జనంతో క్రిక్కిరిసిపోయిన ఆడిటోరియమంతా చప్పట్లతో మారు మ్రోగిపోయింది.

బేబీ మరి రెండు డాన్సులు చేసింది.

'అరె ఖుషీఖుషీ చేస్తేనే కలుగు హుషారు,

బలేబలే మోగునులే వలపు సితారు,

వలపుమజా చూపిస్తా ఇటురావోయ్...' అని ఒకపాట.

'ఇందా ఇందా తీసుకో!

ఇపుడే సొంతం చేసుకో!' అని మరో పాట.

రెండూ సినిమా రికార్డులే!

ఆమె తల్లీ, తండ్రీ, అన్నయ్య, వదిన అందరూ ఆ నృత్యాలు చూశారు.

'బేబీ డాన్సు చెయ్యటం నువ్వు చూశావ్రటా?' అన్నాడు రాజశేఖరం.

బేబీ అతని రెండో సంతానం. పదో తరగతి పరీక్ష వ్రాయ బోతున్నది.

'దేవుడిచ్చిన పాపిష్టి కళ్ళు వున్నాయి కదా నాన్నా!'' అన్నాడు చంద్రశేఖరం.

'బాగున్నాయా డ్యాన్సులు?'

'నీకు బాగున్నాయా నాన్నా?'

'దాన్ని గన్న తండ్రినిరా నేను! బాగుందని అనగలనా? సిగ్గుచేటు!'

'నేనూ దాని సోదరుణ్ణి!...నాకు మాత్రం బాగుంటుందా?'

'మరెందుకో తక్కిన వాళ్ళందరికీ బాగుంది' అంటూ మళ్ళీ నిట్టూర్చాడు రాజశేఖరం.

'లోకం యిలా దిగజారి పోతున్నందుకు కారణం ఏమిటో తెలుసా నాన్నా?'

చంద్రశేఖరం ఉపన్యాసం అందుకుంటాడని తెలియని రాజశేఖరం 'ఏమిటంటావు?' అని అడిగాడు.

'నిద్రపోకుండా విను. మనిషిలోని స్వార్థం, పశుప్రవృత్తి, మూర్ఖత్వం యివి నేడు సంస్కృతీ నాగరికతలకు పట్టిన చెద పురుగులు. సంస్కారం కలిగిన మనిషి తన ఆనందాన్ని ప్రకటించ డానికి కొన్ని హద్దులూ, అడ్డాలూ పెట్టుకుంటాడు. ఒకడిలోనే దాచుకోవలసిన ఆనందం వుంది. ఇద్దరు మాత్రమే పంచుకో వలసిన ఆనందం వుంది. అందరికీ వెదజల్లవలసిన ఆనందమూ వుంది. ఒకరికో లేక ఏ ఇద్దరికో పరిమితమైన ఆనందాన్ని వీధిలో ప్రదర్శిస్తే ఏమౌతుంది? అందరూ నవ్వుతారు. కామ వికారం అంటారు. ఉన్మాద చేష్ట అంటారు. అందుకు భయపడే,

మనుష్యులు బట్టలు కట్టుకోవడం, పెరళ్ళూ మరుగుదొడ్లూ కట్టుకోవడం అలవాటు చేసుకున్నారు. కొన్ని రకాల ఆనందాలకు నిర్జన స్థలాలు, అభ్యంతర స్థలాలూ అవసరమనుకున్నారు. ఈ నియమాలు చేతలకే గాదు, మాటలకూ వర్తిస్తాయి. జంతువులకు ఈ అడ్డాలేవీ లేవు. అవి స్థల కాల నియమాలు లేకుండా ప్రవర్తిస్తాయి. వాటికి సిగ్గెగ్గులు వుండవు. మనిషి కూడా జంతు జాతికి చెందినవాడే! యుగాలు గడిచినా వాడిలోని నెత్తురు రంగు మారనట్లే, వాడిలోని జంతు లక్షణం కూడా మారలేదు. మాటలూ, చేతలూ ఎంతో నాజూకుగా వున్నా, మనసులో మాత్రం జంతు స్వభావాలే! సంఘం వెయ్యి కళ్ళతో పహరా యిస్తూ ఉండటంవల్ల జంతువులా ప్రవర్తించటానికి దమ్ముల్లేక,ఎక్కడైతే జంతు ప్రవృత్తి కంటబడుతుందో అక్కడల్లా మెడలు నిక్కించి చూస్తున్నాడు. అక్కడ మనిషి అనే మాయతొడుగు వూడిపోగా, జంతువైపోయి నవ్వుతున్నాడు. చప్పట్లు చరుస్తున్నాడు. 'వారెవ్వా' అంటూ మెచ్చుకుంటున్నాడు.

'మంచిచెడ్డల విచక్షణా పరిజ్ఞానం వున్నా, సగటు మనిషిని చెడు ఆకర్షించినంత త్వరగా మంచి ఆకర్షించలేదు. లేకపోతే ఈనాడు దేశంలో ఇందరు తాగుబోతులు, పతితులు, పాపాత్ములు వుండేవారు కాదు. చెడు ఎప్పుడగా పైకి తేనెలాగా వుంటుంది. మంచి వేపనూనెలాగా వుంటుంది. మనుషుల్లోని ఈ అభిరుచి, పశుప్రవృత్తి ఆధారంగా వ్యాపారం చేసుకుని, హాయిగా బ్రతక నేర్చిన స్వార్థపరులు దేశంలో ప్రబలిపోయారు. నోటితో చెప్పకోరాని బూతుమాటలకు అక్షరరూపమివ్వడానికైనా వెనుకాడే పవిత్ర భారతదేశంలో నేడు సెక్స్ మ్యాగజైన్లు కాఫీనీళ్ళలాగా అమ్ముడు పోతున్నాయి. శృంగార సంబంధమైన పేర్లతో నెలకో కొత్త పత్రిక చొప్పన పోటీలమీద మార్కెట్టులోకివచ్చి దిగుతున్నాయి. నాన్నా! వాటిని నువ్వు చూడలేదేమోగానీ, ఒకటి రెండు పత్రికలు నేను చూడడం జరిగింది. చూడడమేం కర్మ! ... చివరిదాకా చదివించాయి అవి! నా ఒళ్ళు వేడెక్కిపోయిందనుకో! ఒక్కసారి ఆ పుస్తకంలోకి వెళ్ళిపోతే, ఇక పాఠకుణ్ణి అవి వెనక్కి పంపించడమంటూ జరగదు. అదొక అనంత స్వేచ్ఛా లోకం! అక్కడి స్వేచ్ఛకు సంకెళ్ళూ, సరిహద్దులూ వుండవు. 'నో అడ్మిషన్' బోర్డులుండవు. పాఠకుడు చీకట్లోంచి కూడా చూడగలడు. శోభనపు గదులలోకి, వ్యభిచార గృహాల్లోకి అదృశ్యరూపంలో వెళ్ళి సినిమా చూసినట్లో, సర్కస్ చూసినట్టో చూస్తూ కూర్చోగలడు. సంసార స్త్రీల రహస్య కలాపాలను కళ్ళారా చూడగలడు. ఆ సన్నివేశాలన్నీ ఆ పుస్తకంలో సచిత్రంగా వుంటాయి. ఆ చిత్రకారుడి నైపుణ్యం మయుని మహేంద్ర జాలం లాంటిది. ఇవి సజీవరూపాలా అని భ్రమింపజేస్తాయి ఆ గీతలు. అయితే అది చదునైన న్యూస్ ప్రింటు మాత్రమే!

'ఈ సెక్స్ మాగజైన్లకు ఏ మాత్రం తీసిపోకుండా తయారయ్యాయి ఈ సినిమాలు. సినిమా వర్తకుడికి ప్రధానంగా కావలసింది డబ్బు! అపారమైన డబ్బు! డబ్బు వుంటే తక్కిన కోరికలన్నీ తీర్చుకోవచ్చు గనుక, ముందుగా సంపాదించాల్సింది డబ్బు! ప్రేక్షకులు తన మీద కనకవర్షం కురిపించాలంటే, తన సినిమా కళను బట్టలూడదీసి బజారుకు పంపించాలన్నదే అతడు కనిపెట్టిన నగ్నసత్యం! అలా చేయడానికి అతడేమాత్రం సందేహించడు.

'సినిమా నటికి కావలసింది కూడా డబ్బే! కనుక ఆ లోకేశ్వరి సెక్స్ మాగజైన్‌లోని పాత్రలాగా నటించడానికి సంసిద్ధంగా వుంటుంది.

'సినిమా రచయితకు కావలసింది కూడా డబ్బే! కనుక ఆ వాగనుశాసనుడు శృంగారం కోసం యువక పాత్రలచేత, హాస్యం కోసం వృద్ధ పాత్రలచేత బూతుపాటలు పాడించడానికీ, బూతు మాటలు పలికించడానికీ ఒప్పుకొని తీరాల్సిందే! అవకాశం వచ్చినప్పుడల్లా మాటల్లో ద్వంద్వార్థాలు ప్రతిధ్వనించాల్సిందే! ఉదాహరణకు – ఓ పల్లెటూరి పిల్ల మామిడిపళ్ళు అమ్ముకోడానికి పేట కొస్తుందనుకో! ఓ అబ్బాయి ఆమెను దగ్గరికి పిలుస్తాడు. వాళ్ళ సంభాషణ యిట్లా వుంటుంది –

'పిల్లోయ్! నీ మామిడిపళ్ళు నా కమ్ముతావా?'

'అమ్మకోటానికే గదా బాబూ, యింతదూరం వచ్చాను!'

'గట్టి పళ్ళేనా? ఏదీ, చూడనియ్యి!'

'ఆఁ! ఆఁ! ముట్టుకోకండి బాబూ! నలిగిపోతై! డబ్బిచ్చి మరీ చెయ్యి బెట్టండి!'

'బాగున్నాయో లేదో చూడకుండానే డబ్బిచ్చుకోమంటావా?...బాగుంది నీతో బేరం!'

'ఏంటి బాబూ, మీరు చూసేది? ఊరంతా అమ్ముకొస్తున్నాను. మీ దగ్గరికొచ్చేసరికి బాగాలేకపోయాయా?'

... ఇది మామిడిపళ్ళ బేరమే గావచ్చు. కానీ దీనివెనక ఏదో చౌకబారుతనం తొంగిచూడటం లేదూ?... ఓ పల్లెపడుచుకు గాజులబత్తుడిచేత గాజులు తొడిగిస్తూ, ఇలాగే శ్లేష వచ్చే సంభాషణ తయారు చేయొచ్చు. ఇక పాటల దగ్గరి కొచ్చేసరికి ఈ వ్యంగ్యం కూడా మాయమైపోయి, బూతు అనేది డైరెక్టుగా దూసుకొచ్చేస్తుంది. 'వాల చూసుకో–వీలు చేసుకో! వంగపండు లాంటి దాన్ని – వలపు దోచుకో!'... ఈ పాట నువ్వు విన్నావా నాన్నా? పోనీ, ఇంకో పాట–మన బేబీ కూడా పాడుతూవుంటుంది 'మెల్ల మెల్ల మెల్లగా–అణువణువూ నీదెగా–మెత్తగ అడిగితే లేదనేది లేదుగా–మెల్ల మెల్ల మెల్లగా...' ఈ సినిమా పాటలకున్నంత వ్యాప్తి ఈ దేశంలో మరిదేనికుంది? మాటలురాని వేలెడంత కుర్రది కూడా 'కొట్టు కొట్టు బుల్లోడా పంపుగొట్టురా, బండి క్లీనుజేసి లైనుమీద బెట్టురా...' అని పాడుకుంటూ వీధిలో వెడుతూ వుంటుంది. హరికథ చెప్పే హరిదాసుకూడా 'అప్పుడు హిడింబి, భీమసేనుడూ మోహపరవశులై ఏవిధంగా క్రీడిస్తున్నా

రండీ అంటే – చలిగావుందీ, చంపేస్తోందీ, రా రా కప్పుకుందాం...’ అంటూ సినిమా పాటలతోనే హరికథ పూర్తిజేస్తున్నాడు. మనిషికి ప్రాథమికావసరాలు ఏవని అడిగితే – ముందు సినిమాను పేర్కొని, తరువాతే తిండి, గుడ్డ, నీడ అని చెప్పుకోవాల్సి వస్తోంది. ఆ పూట పస్తయినావుండి సినిమాకు వెళ్ళేవాళ్ళు చాలా మంది వున్నారు ఈ దరిద్ర దేశంలో. సినిమాల్లో మంచివుందని బల్లగుద్ది చాటే ఫిలింఫాన్సుకు ఏమని సమాధానం చెప్పగలం ? కె. వి. రెడ్డి, బి. ఎన్. రెడ్డిలాగా కళాత్మకంగా, వినోదాత్మకంగా ప్రబోధాత్మకంగా ఫిలింతీసే ఉత్తమ కళాకారులు మనలో ఎందరున్నారు?...తల్లిపాలు చాలక నేను ఆవు పాలు త్రాగేరోజుల్లో – చెంబెడు పాలలో చారెడు నీళ్ళు గలిపి అమ్మేవారేమోగానీ, వర్తమానకాలంలో చెంబెడు నీళ్ళలో చారెడు పాలు కలిపి అమ్ముతున్నారు. ఉదయం మనం కొనుక్కునే ఆ సున్నపు తేటలాంటి పల్చని ద్రావణంలో నిజంగా ఎన్ని పాలచుక్కలుంటాయి? సినిమాల్లో మంచికూడా అంతే వుంటుంది. కాగితంమీద, తెరమీద అసభ్యతను, అశ్లీలాన్ని, సెక్స్ అప్పీల్‌ను ప్రతిష్ఠాపనజేసి మనిషిలో పాశవికతను ప్రకోపింపజేసే సంఘ విద్రోహశక్తుల్ని క్షమించి వూరుకోవడం చేజేతులా జాతివినాశనాన్ని కోరితెచ్చుకోవడమే! మనుషుల్లో హంతకులున్నట్టే – సినీ కళాకారుల్లోను, పత్రికా రచయితల్లోనూ హంతకులున్నారు మొదటివాడు మనిషిని భౌతికంగా హత్యచేస్తున్నాడు. ఈ రెండోరకం హంతకులు ఒక్కణ్ణి విడిచిపెట్టకుండా జాతి మొత్తాన్నీ ఆత్మికంగానూ, నైతికంగానూ హత్యచేస్తున్నారు. ఆ నేరంకంటే ఈ నేరం కోటిరెట్లు పెద్దది. ఐతే మనిషిని చంపినవాణ్ణి మనం ఉరితీస్తున్నాము. జాతిని చంపుతున్నవాణ్ణి పోషిస్తున్నాము. పాము కాటువేస్తుందని తెలిసికూడా దానికి పాలుబోసి పెంచుతున్నాము.

‘ఈతరం కుళ్ళిపోతే పోనీ, భావితరమైనా బాగుపడేటట్లు చూచే బాధ్యత కలిగిన వ్యవస్థలు రెండే! ఒకటి, యిల్లు. రెండు, బడి. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు శ్రద్ధవహించకపోతే ఏమౌతుంది? వాళ్ళను అదుపు ఆజ్ఞల్లో వుంచక, అతి గారాబంతో అల్లారుముద్దుగా పెంచితే ఏమౌతుంది? వాళ్ళను వెంటేసుకుని, వయోజనులను మాత్రమే దృష్టిలో వుంచుకొని సెన్సారుబోర్డును జోకొట్టి నిర్మించిన నేటి సినిమాల్ని జూలో జంతువుల్ని చూపించినట్టు చూపుతూవుంటే ఏమౌతుంది? దీనికి సమాధానం మన బేబీ!...ఒకరి మూర్ఖత్వం మరొకర్ని చెడగొడుతుందనడానికి మన బేబీ నిదర్శనం!

‘ఇక బడిదగ్గరికొద్దాం.’ ‘నేటి పాపలే రేపటి పౌరులు’అని అంటుంటాము. వయస్సుతోబాటు క్రమంగా పెరిగి రేపెప్పుడో వాళ్ళు పౌరులవుతారు. కానీ, నేడు పాఠశాలల్లో కనిపిస్తున్న విపరీతమేమంటే – నేటి పాపలందరూ నేడే పౌరులైపోతున్నారు. ఏ వయస్సులో తెలుసుకోవలసిన సంగతులు ఆ వయస్సులో తెలుసుకుంటేనే ఆరోగ్యం! పంతుళ్ళు పిల్లలకు నేర్పవలసింది విద్యా విజ్ఞానాలేగానీ, యౌవన వసంతంలోని మాధుర్యాలుకాదు. ఒక వయస్సులో వున్నవారిని అంతకంటే పై వయస్సుకు సంబంధించిన అనుభవాల్లోకి లాగడం చాలా ప్రమాదకరం!... పాలుతాగే పురిటి పాపకు అన్నం పెడతామా? ఆడుకునే అమ్మాయికి చీరకడతామా? వయస్సురాని ఆడపిల్లకు పెళ్ళిజేస్తామా? మైనారిటీ తీరని కుర్రవెధవకు ఆస్తివ్యవహారాలు అప్పగిస్తామా ?... ఇవి చేయకూడని పనులు అని తెలుసుకోలేకపోతే, అది మూర్ఖత్వమా కాదా ? పిల్లల స్వభావం తెలుసుకోకుండా పాఠాలు బోధించడానికి ఎవరికీ అర్హతలేదు. అందుకే టీచర్ కానడానికి ముందు ట్రైనింగ్ అన్నారు. ట్రైనింగులో చిల్డ్రన్స్ సైకాలజీ అని ఓ సబ్జక్టు! పిల్లల మనశ్శాస్త్రం ఏమంటుందంటే, ‘పాపల మనస్సు ఒక వింత పలక! ఆ పలకమీద రాసిన మాట మళ్ళీ తుడిచినాపోదు. కనుక, ఓ భావి ఉపాధ్యాయుడా! ఆ పలకమీద రాసేముందు కాస్త ఆలోచించి సరైనమాటే వ్రాయి. జాగ్రత్త! పొరపాటున తప్పు రాశావా, దాన్ని తుడిచేయడం నీ తరంగాదు!’

‘ఇలా చెయ్యవద్దు’ అనకుండా, ‘ఇలా చెయ్యి’ అనే అనమంటుంది సైకాలజీ. ‘సత్యము పలుకుము’ అనేమాట నేర్పాలిగానీ, ‘అబద్ధము చెప్పరాదు’ అని నేర్పకూడదు. ‘పరులకు ఉపకారము చేయవలెను’ అనాలి. ‘పరులకు అపకారము చేయరాదు’ అనకూడదు. పిల్లలకు చేయవలసినవే చెప్పాలిగానీ, చేయకూడనివి చెప్పరాదు. ఏదో కథలో ‘ఈ మూడువైపులా వెడితే వెళ్ళావుగానీ, ఉత్తర దిక్కుగా మాత్రం వెళ్ళకు’ అని ఓ తండ్రి కొడుక్కి చెబితే, వాడు ‘ఉత్తర దిక్కులో ఏముంది? ఎందుకు వెళ్ళొద్దన్నాడు నాన్న? వెళ్తేనేం? వెళ్ళి చూడాల్సిందే!’ అనుకుని, అనుకున్నంత పని చేశాడట!...అట్లాంటివాళ్ళు పిల్లలు! వాళ్ళను దుర్గుణాల ప్రభావంనుండి, దుర్వ్యసనాల ఆకర్షణనుండి రక్షించవలసిన ఉపాధ్యాయుల బుద్ధికే గ్రహణం పడితే, భావి భారతదేశం బాగుపడినట్లేనా?...మన వూళ్ళోని హైస్కూలు విషయమే తీసుకుందాం. వాళ్ళ ఘనత ఎలాంటిది?...

‘మన వూళ్ళోకి కొత్త సినిమా వస్తే వీధుల్లో కరపత్రాలు కురుస్తాయి. లౌడ్ స్పీకర్లు గింగురుమంటాయి. ఆ కరపత్రాలు, లౌడ్ స్పీకర్లు ఏమంటాయి?... ‘హుషారైన పాటలు! పసందైన మాటలు! మైమరపించే ప్రణయ సన్నివేశాలు! మత్తెక్కించే నృత్యాలు! కైపెక్కించే క్లబ్ డాన్సులు! మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే మహత్తర చిత్రం! సోదర సోదరీ మణులారా! పిల్లా జెల్లా, ముసలీ ముతకా అనకుండా ఆబాల గోపాలంగా రండి! త్వరపడండి! ఆలసించిన అందవు టిక్కెట్లు!...’ సినిమాలవాళ్ళు ఊరించే అందాలు, ఆకర్షణలు ఈనాటి వార్షికోత్సవంలో వున్నాయా, లేదా? ఏండ్లతరబడి తెరమీద జీవిస్తూ వయస్సు చెప్పకోకుండా జాగ్రత్తపడే సినిమా నటీమణులకంటే–గౌన్లతో, పరికిణీలతో బడికివెళ్ళే మన అమ్మాయిలు నడకలో, నాట్యంలో, వొంపుల్లో, వొయ్యారాల్లో ఏమాత్రం తీసిపోరని నమ్మకం కుదిరిందా, లేదా?

ఆ గేయనాటిక నువ్వు చూశావుకదూ? ‘రాధాకృష్ణ’! యమునాతీరంలో మురళీకృష్ణుడు గోపికలతో రాసక్రీడాలోలుడై

వుంటాడు. మంచినీళ్ళనెపంతో రాధ కృష్ణుణ్ణి వెతుక్కుంటూ వస్తుంది. చేతిలోకి అందీ అందకుండా ఆమెను ఉడికిస్తాడు గోపాలుడు. రాధ యిక విరహాన్ని సైపలేక రోదిస్తూ కిందికి ఒరిగిపోతుంది. అప్పుడు కృష్ణుడు జాలిపడి, ఆమెను రెండు చేతులతో లేవనెత్తి దగ్గరకు తీసుకుంటాడు. రాధ అలిగి దూరంగా జరుగుతుంది. అలక మానమని కృష్ణుడు బతిమాలుకుంటాడు. చక్కిలిగింతలుపెట్టి, ఆమెను నవ్విస్తాడు. ఇద్దరూ చేయి చేయి కలిపి సినిమా ట్యూనుతో యుగళగీతం పాడుతూ, రకరకాల భంగిమలతో డాన్సుచేస్తూ చల్లని వెన్నెలలో చలిగాలిలో యమునాతీరంలో విహరిస్తారు. 'ప్రేమేకాదా జగమంటే! నీవూ నేనూ ఒకటే! నీలో వున్నది నేను! నాలో వున్నది నీవు! మనలో వున్నది సర్వం! ఇంకెందుకులే స్వర్గం?' అని వాళ్ళు పాత్రల్లో లీనమైపోయి అభినయిస్తూ వుంటే—ఆ తెరకున్న సిగ్గు ఎదుట కూర్చునిచూచే ప్రేక్షకులకు లేకపోయింది గదా!

'ఈ రాధాకృష్ణ గేయనాటికా ప్రదర్శనకు వెనుక ఒక చిన్న గాథ వుంది. హైస్కూల్లో పాల్ అనే ఓ టీచరున్నాడు. అతనికి ఒక మాండలిన్ వుంది కొన్ని క్రైమ్ పిక్చర్సులోని హిట్ సాంగ్సు తన మాండలిన్‌మీద మజాగా వాయిస్తాడు పాల్. అవే ట్యూన్సుతో ఒక గేయనాటిక తయారైతే బాగుంటుంది కదా అని అతని యోచన. పదిరోజుల కిందట సీనియర్ తెలుగు పండితుణ్ణి తన గదికి తీసుకెళ్ళి ఆదరంగా కూర్చోబెట్టి, కాఫీయిచ్చి, తన మాండలిన్‌మీద ఐదారు సినిమా పాటలు వాయించి, 'సార్! ఈ ట్యూన్సుతో ఓ అయిదు పాటలు ఉండేటట్లుగా 'రాధాకృష్ణ' రాసివ్వండి సార్ ! అన్నాడు. సీనియర్ తెలుగు పండితుడు సినిమా పాటలకు తీసిపోనివిధంగా పాటలు రాయడం, పాల్ తన మాండలిన్ మీద సినిమాట్యూన్సు మక్కీకి మక్కీగా వాయించడం, పంతులమ్మలు నృత్యదర్శకత్వం వహించడం, నాటికవేసిన ఆడపిల్లలు – ముఖ్యంగా రాధాకృష్ణులు సినిమాహీరో హీరోయిన్లలాగే అత్యంత సన్నిహితంగా డాన్సుచేయడం...ఆరి భగవంతుడా! ఈ సినిమా దొమ్మరాటలతో పాఠశాలలు కూడా భ్రష్టమైపోతున్నాయిగదా!...పోనీ, ఆ పాల్‌కు కృష్ణుడే కావాలనుకుంటే మరో కృష్ణుడే దొరక్కపోయాడా? నవనీత చోరుడో, కాళీయమర్దనుడో, మృత్తికాఖాదియో, కుచేల కృష్ణుడో పనికి రాకపోయాడా?... వావీవరసాలేని రాధాకృష్ణుల నిషిద్ధ ప్రణయానికి ఎ. సర్టిఫికేటు సినిమా సంగీత సాహిత్యాలను జోడించి, నేడో రేపో కళ్ళు తెరవబోతున్న చిన్నపిల్లలచేత చిన్నపిల్లలకోసం ప్రదర్శించడం మూర్ఖత్వం ఔనా, కాదా ?

'బేబీ చేసిన డాన్సులు చూశావుగదా?...అలాంటి శృంగార గీతాలు, నృత్యాలు చదువుకుంటున్న పిల్లకు నేర్పి, రచ్చబండ మీద కెక్కించి ఆడమనడం, ఆహా ఓహో అంటూ అందరూ నిక్కినిక్కి చూడటం, అది చూచి నువ్వూ నేనూ తల లూంచుకోవడం...ఎందుకొచ్చిన చదువులు నాన్నా?... అటువంటి పాటలు, నృత్యాలు ప్రదర్శించకుండా జాగ్రత్త పడాలన్న ఇంగిత జ్ఞానం టీచర్లకు వుండక్కర్లేదూ? ఇన్నేళ్ళుగా చూస్తున్నాను. అటువంటివే నేర్పుతున్నారు. అటువంటివే బేబీచేత వేయిస్తున్నారు. ఇప్పటికే తానొక సినిమాతార అన్నంతగా పొగరెక్కిపోయింది దానికి! ఎప్పుడూ ముద్దు ముద్దు మాటలు, గారాబు చేష్టలు, బూతు పాటలు! సినిమా వర్తకుల స్వార్థపరత్వం, పెద్దవాళ్ళ మూర్ఖత్వం, బేబీలోని జంతుప్రవృత్తి ఈనాడు దాన్నియిట్లా తీర్చి దిద్దాయి. చూస్తూవుండగానే ఎప్పుడో ఒకప్పుడు కొంప అంటుకుపోతుంది. అంతవరకూ నేను శుష్కోపన్యాసం చేస్తూ వుండాల్సిందే, నువ్విలా నిద్రపోతూ వుండాల్సిందే!...'

చంద్రశేఖరం దీర్ఘోపన్యాసం ఆపి, తండ్రికేసి చూశాడు.

'నాన్నా!'

రాజశేఖరం నేలమీదికి ఒరిగిపోయి గురకతీస్తున్నాడు.

'బూడిదలో పోసిన పన్నీరు!' అంటూ చుట్టూ చూశాడు చంద్రశేఖరం. అమ్మ, బేబీ యిద్దరూ నిద్రపోతున్నారు. అతని భార్య మాత్రం సగం మూతపడిన కళ్ళతో అతని పక్కన కూర్చుని వుంది.

'అప్పుడే అయిపోయిందా!' అంటూ ఉలికిపడి, కళ్ళు పూర్తిగా తెరిచింది. 'అబ్బ! మీకెన్ని సంగతులు తెలుసునండీ!... బళ్ళో తెల్లలాల్చీ ఆయన మాట్లాడాడు చూడండీ...ఆయనకంటే ఎక్కువసేపే మాట్లాడారు. అయినా కన్నతండ్రితో ఇలాంటి మాటలు మాట్లాడటానికి మీకు సిగ్గులేదూ ?' అంది మెల్లగా.

'ఇహ లేవండి ! నిద్దరొస్తోంది!' అంటూ ఆవలిస్తూ పైకి లేచి మేడమెట్లు దిగిపోయింది.

ఊరంతా నిద్రపోతూ వుంది !